నమస్తే తెలంగాణ

మెదక్

I హైదరాబాద్, శుక్రవారం 8 నవంబర్ 2024 MEDAK



సదర్ ఉత్సవాల్లో పాల్గొని దున్నపోతును ఆడిస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

# అలరించిన సదర్ ఉత్సవాలు

**హాజరైన ఎమ్మెల్యే హరీశ్‌రావు**

సిద్దిపేట, నవంబర్ 7: సిద్దిపేటలోని బాబా జుమా మ్ చౌరస్తాలో శ్రీకాంత్ యాదవ్, నరేశ్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సదర్ ఉత్సవాలకు ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ..యాదవులకు మంత్రి పదవి ఇచ్చిన ఘన త కేసీఆర్‌దే అన్నారు. నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లో ఒక్క యాదవ మంత్రి లేడన్నారు. తిరుమ లలో వేంకటేశ్వర స్వామి తొలి దర్శనం యాదవు లకే దక్కుతుందన్నారు. యాదవుల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన గొర్రె పిల్లల పంపిణీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి పొట్ట గొడుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, పోచబోయిన శ్రీహరి యాదవ్, మామిండ్ల ఐలయ్య యాదవ్, రాజనర్సు, బర్ల మల్లికార్జున్, సాయికుమార్, పూజల వెంకటేశ్వరరావు, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు అన్యాయం

**బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి**



గజ్వేల్, నవంబర్ 7: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాలతో ఆదాయం తగ్గిపోయిందని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రీజినల్ రింగ్‌రోడ్డు పనులు అటకెక్కాయని, ప్రభుత్వ తీరుతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలైందని, వ్యాపారవేత్తలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. రూ.2లక్షల పంట రుణమాఫీ పూర్తిగా చేయలేదని, రైతులకు రైతుబంధు ఇవ్వకుండా నోట్లో మట్టి కొట్టిందని విమర్శించారు ఆరుగ్యారెంటీలు, అనేక హామీలిచ్చి ఏ ఒక్కటి అమలు చేయలేడం లేదన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన దుర్మార్గమైన ప్రభుత్వం కాంగ్రెస్‌ది అని విమర్శించారు. రోజుకో డ్రామా, రోజుకో డైవర్షన్ టాఫిక్‌తో రాష్ట్రంలో ముఖ్యమంత్రి, మంత్రులు దోచుకుంటున్నారని మండిపడ్డారు. పాలన గాడి తప్పిందని, వ్యాపారులు, రైతులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం రూ.90 వేల కోట్ల అప్పులు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదన్నారు. ఎటుచూసినా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారని, ప్రభుత్వం ఎవరిని పట్టించుకోవడం లేదన్నారు. గురుకులాలు సమస్యలతో సతమవుతున్నాయని తెలిపారు. కలుషిత ఆహారంతో విద్యార్థులు దవాఖానల్లో చేరుతున్నరని, విద్యార్థుల సం క్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని దుయ్యబట్టారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు వసూళ్లుకు పాల్పడుతున్నారని, పరిశ్రమల యాజమాన్యాలను బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. గజ్వేల్ అభివృద్ధికి కేసీఆర్ మంజూరు చేసిన రూ.170కోట్ల నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.




శబాష్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# వేగంగా ధాన్యం తూకం వేయాలి

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

శివ్వంపేట, నవంబర్ 7: మండలంలో ధాన్యం తూకాలు వేగంగా వేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని గంగాయిపల్లి, శబాష్‌పల్లి, దొంతి, పాంబండ, కొత్తపేట, లింగోజిగూడ, తాళ్లపల్లి తండాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురువారం కొనుగోలు కేంద్రాలను జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డితో కలిసి ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..సన్నవడ్లకు బోనస్ ఇస్తామని అనడం సరికాదన్నారు. సన్నరకం వడ్లు ఎప్పుడు కొనుగోలు చేసి బోనస్ చెల్లిస్తారో ప్రభు త్వం చెప్పాలన్నారు. దళారులకు ధాన్యం అమ్మి రైతులు నష్టపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ఇప్పటివరకు గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కొడకంచి శ్రీనివాస్ గౌడ్, పులిమామిడి నవీన్ గుప్తా, బాసంపల్లి శ్రీనివాస్‌గౌడ్, తాటి పవన్ గుప్తా, మర్రి మహేందర్ రెడ్డి, గూడూరు యాదగౌడ్, ఏనుగు అశోక్ రెడ్డి, రంగపల్లి పార్వతి సత్యం, కన్నారం దుర్గేశ్, మొలుగు నాగేశ్వరరావు, ఎండీ లాయక్, బుద్ధుల భిక్షపతి, పీఏసీఎస్ సీఈవో మధు తదితరులు పాల్గొన్నారు.



వట్‌పల్లిలో మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

# అందరికీ అండగా ఉంటాం

**వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

వట్‌పల్లి, నవంబర్ 7: నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రానర్సింహ భరోసా ఇచ్చారు. గురువారం వట్‌పల్లి మండలంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వట్‌పల్లి అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌తో పనిచేస్తున్నట్లు తెలిపారు. తాను మార్కెటింగ్‌శాఖ మంత్రిగా ఉన్న సమయంలో వట్‌పల్లి మార్కెట్ యార్డును అధునాతన వసతులతో ఏర్పాటు చేశానన్నారు. నియోజకవర్గంలో రూ.152 కోట్లతో త్వరలో రోడ్ల మరమ్మతులు చేపడతామని చెప్పారు. వట్‌పల్లిలో పోలీస్ స్టేషన్ భవనం, మండల పరిషత్, తహసీల్ కార్యాలయాల ఏర్పాటుకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. వట్‌పల్లిలో విద్యాభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు. వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీ శేషారెడ్డి, వైస్ చైర్మన్ ఈశ్వర్, పాలక వర్గ సభ్యులకు మంత్రి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఆర్డీవో పాండు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్ జోషి, మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు రాంరెడ్డి, సంగమేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

అందోల్, నవంబర్ 7: అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలో త్వరలో ప్రారంభం కానున్న నర్సింగ్ కళాశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం వైద్యారోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఆర్డీవో పాండు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్ రేఖా ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## భూసర్వేను వేగవంతం చేయాలి: కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనుల భూసర్వే వేగవంతం చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నేషనల్ హైవే అథారిటీస్ అధికారులతో నేషనల్ హైవే 765-డీజీ మెదక్- సిద్దిపేట, మెదక్ టు ఎల్లారెడ్డి ఎస్‌హెచ్-765డీ రోడ్డు నిర్మాణ పనుల భూసర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మెదక్- సిద్దిపేట 69.97 కిలోమీటర్లు రూ.500 కోట్లు, మెదక్-ఎల్లారెడ్డి 43 కిలోమీటర్లు రూ.200 కోట్లతో చేపట్టనున్న నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి భూసర్వే వేగవంతం చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సహకరించి, నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. సమీక్షలో మెదక్ ఆర్డీవో రమాదేవి, నేషనల్ హైవే అథారిటీ ఈఈ బలరామ్‌కృష్ణ, డీఈ ప్రవీణ్ రెడ్డి, వినోద్, మురళి, కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్స్ పాల్గొన్నారు.

# ఫలించిన ఎమ్మెల్యే పల్లా కృషి

**చేర్యాల కోర్టుకు సిబ్బంది కేటాయింపు**



చేర్యాల, నవంబర్ 7: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేర్యాలకు మంజూరు చేసిన మున్సిఫ్ కోర్టును ప్రారంభించేందుకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృషి చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కోర్టు ప్రారంభం కావాల్సి ఉండే, ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది. అనంతరం కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రావడంతో కోర్టు ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగలేదు. కోర్టుకు కావాల్సిన సిబ్బందిని కేటాయించకపోవడంతో ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయింది. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంబంధిత శాఖ ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరించారు. దీంతో చేర్యాల కోర్టుకు సిబ్బందిని కేటాయిస్తూ న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి జీవో జారీ చేశారు. చేర్యాల కోర్టులో 27 మంది సిబ్బంది పని చేసే విధంగా న్యాయశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. చేర్యాలలో కోర్టు ఏర్పాటు ప్రక్రియలో ముఖ్య భాగమైన సిబ్బంది కేటాయింపునకు కృషి చేసిన ఎమ్మెల్యేకు బీఆర్‌ఎస్ నాయకులు, న్యాయవాదులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# గురుకులాల్లో సమస్యల తిష్ట



సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తిలోని ఎస్టీ గురుకుల కళాశాలలో తాగునీటి కోసం వాటర్ ట్యాంకు వద్ద బారులుతీరిన విద్యార్థులు

- అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగింపు
- వేధిస్తున్న మౌలిక వసతులు
- అందని పౌష్టికాహారం
- పడకేసిన పారిశుధ్యం..టీచర్ల కొరత
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

సంగారెడ్డి, నవంబర్ 7(నమస్తే తెలంగాణ):జిల్లాలో గురుకుల విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. గురుకులాల్లో సరైన వసతులు లేక, పౌష్టికాహారం అందక, తాగునీటి కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ గురుకులాల్లో చాలాచోట్ల సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందిగా కాలం వెల్లదీస్తున్నారు. అధికశాతం గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించాలన్న సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం సంగారెడ్డి జిల్లాలో గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేసింది. చాలా మటుకు గురుకుల పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. కేసీఆర్ సర్కార్‌లో గురుకుల పాఠశాలల్లో సకల వసతులతో విద్యార్థులు సంతోషంగా ఉన్నారు. మంచి విద్య అందడంతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలపై శీతకన్ను వేసింది. సంగారెడ్డి జిల్లాలో 12 సోషల్ వెల్ఫేర్(ఎస్సీ) గురుకుల కళాశాలలు ఉన్నాయి. 7వేల మందికిపైగా బాలబాలికలు ఎస్సీ గురుకులాల్లో విద్యను అభ్యసిస్తున్నారు. 11 బీసీ గురుకుల కళాశాలల్లో 6వేల మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. జిల్లాలో 6 గిరిజన గురుకుల కళాశాలలు ఉన్నాయి. ఇందులో 3600 మంది విద్యార్థులు చదవుతున్నారు. 10 కిపైగా మైనార్టీ పాఠశాల, కళాశాలల్లో 6వేల మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. సోషల్ వెల్ఫేర్(ఎస్సీ) గురుకుల కళాశాలల్లో సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిన్నారంలోని ఎస్సీ గురుకుల కళాశాల, ఎస్టీ గురుకుల కళాశాలలో పారిశుధ్యం, తాగునీటి కొరత సమస్యలు ఉన్నాయి. ఎస్టీ బాలుర గురుకుల కళాశాలకు ప్రహరీ లేదు. నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తిలోని ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో పారిశుధ్యం లోపించింది. పౌష్టికాహారం అందడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. కళాశాలలో తాగునీటి కొరత వేధిస్తున్నది. జిల్లాలోని అధికశాతం గురుకుల కళాశాలల్లో సిబ్బంది కొరత ఉంది. రెగ్యులర్ లెక్చరర్లు లేకపోవడంతో బోధనపై ప్రభావం పడుతున్నది. ఇటీవల న్యాల్‌కల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ప్రజాప్రతినిధులు, అధికారులు గురుకులాలను పట్టించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రజ్ఞాపూర్ సమీపంలోని ఎస్సీ గురుకుల పాఠశాల,కళాశాల భవనం



అధ్వానంగా కరస్‌గుత్తిలోని ఎస్టీ గురుకుల కళాశాల బాత్‌రూమ్‌లు



దుబ్బాకలో సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో తరగతి గదిలో నేలపైన విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు



దుబ్బాకలో బాలుర గురుకులంలో తరగతి గదిలోనే బట్టలు ఆరబెట్టుకుంటున్న విద్యార్థులు

## సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులు

దుబ్బాక/గజ్వేల్, నవంబర్ 7:పేదపిల్లలకు ఉచిత వసతితోపాటు గుణాత్మకమైన విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలు, కళాశాలలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వీటి నిర్వహణను పట్టించుకోక పోవడంతో విద్యార్థులు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**దుబ్బాకలో...**

సిద్దిపేట జిల్లా దుబ్బాకలో సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. భవనానికి అద్దె భారీగా చెల్లిస్తున్నా కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అద్దె భవనంలోని ఇరుకైన తరగతి గదుల్లోనే విద్యార్థులు ఓ పక్క విద్యనభ్యసిస్తూ...మరోపక్క బస చేస్తున్నారు. తరగతి గదుల్లోనే తమ బట్టలను ఆరబెట్టుకోవడమే కాకుండా అందులోనే నిద్రిస్తున్నారు. తరగతిగదిలో బట్టలు ఆరబెట్టడంతో దుర్గంధంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తరగతి గది, వసతి గది ఒక్కటే కావడం సమస్యగా మారింది. విద్యార్థులు చదువుకునేందుకు బెంచీలు, డెస్క్‌లు లేకపోవడంతో నేలపైనే చదువులు కొనసాగుతున్నాయి. 475 మంది విద్యార్థులకు కేవలం 12 మరుగుదొడ్లు, 12 స్నానపు గదులు మాత్రమే ఉన్నాయి. స్నానపు గదులకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులకు సమస్యగా మారింది. విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. ఆరుబయట వర్షంలోనే స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొంది. కిటికీలకు తలుపులు లేకపోవడంతో రాత్రివేళలో చలి తీవ్రతతో వణుకుతున్నారు. దోమలు, ఈగల సమస్య విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. దుబ్బాక పట్టణానికి 2 కిలోమీటర్ల దూరంలో నిర్మానుష్య ప్రాంతంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారు. ఈ వసతి గృహానికి అద్దె రూ.2.27 లక్షలు చెల్లిస్తున్నప్పటికీ విద్యార్థులకు మాత్రం వసతులు లేవు.

**గజ్వేల్‌లో...**

గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో రాజీవ్ రహదారి పక్కన అద్దె భవనంలో వర్గల్‌కు చెందిన ఎస్సీ బాలుర పాఠశాల,కళాశాల కొనసాగుతున్నాయి. ఈ గురుకుల పాఠశాల కిటికీల అద్దాలు పగిలిపోవడంతో రాత్రి సమయంలో దోమలతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. గురుకుల పాఠశాల పక్కనే మురుగునీరు చేరడంతో దోమలు వృద్ధి చెంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల భవనం వెనకాల మురుగునీటి ప్రవాహంతో దుర్గంధం వెదజల్లుతున్నది. ఐదు నుంచి పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన 500 పైగా విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఒక్కో తరగతికి రెండు సెక్షన్లుగా విభజించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. కానీ, వారికి కావాల్సిన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

# సమగ్ర కుల గణనకు ప్రజలు సహకరించాలి

- హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ మూడో వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ పక్కన సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్, నవంబర్ 7: సమగ్ర కుల గణను దేశానికే దిక్సూచిగా మారనున్నదని, దీనికి ప్రజలందరూ సహకరించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, వైద్యం కుల గణన ద్వారా భవిష్యత్తులో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో పలు అభివృద్ధి పనుల కోసం రూ.10కోట్ల నిధులు మంజూరయ్యాయని, వీటితో డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. అన్ని కులాలకు రీడింగ్ రూమ్స్ పేరుతో ఒక్కోటి రూ.45 లక్షల చొప్పున కేటాయించామన్నారు. పట్టణంలో నాలుగు చౌరస్తాలను ఆధునీకరించేందుకు రూ.2కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఎల్లమ్మ చెరువు కట్ట ఆధునీకరణ కోసం రూ.18కోట్లు, కొత్తపల్లి-హుస్నాబాద్ నాలుగు లేన్ల రోడ్డుకు రూ.75కోట్లు వచ్చాయన్నారు. దవాఖానను 250 పడకలకు అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. ఆరు గ్యారెంటీలు రాని వారు వెంటనే అధికారులను సంప్రదించాలన్నారు. రెండు లక్షలపైన రుణమాఫీ త్వరలోనే అవుతుందన్నారు. పట్టణంలో రేషన్ షాపుల సంఖ్యను పెంచుతామని హామీ ఇచ్చారు.

**పైరవీలకు రావొద్దు...**

ఆర్టీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తన వద్దకు పైరవీలు, ఇతరత్రా పనుల కోసం రావొద్దని మంత్రి పొన్నం అన్నారు. నిత్యం వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయన్నారు. ఆర్టీసీ, విద్యాశాఖలో ఎక్కడైనా పనిచేయాల్సి ఉంటుందని, ఈ రెండు శాఖలకు సంబంధించిన ఉద్యోగులు ఇక నుంచి తనవద్దకు రావొద్దని కోరారు. రవాణా శాఖ మంత్రిగా ఉండి ఆ శాఖలోనే సిఫారసులు చేయడం బాగుండదని, ఉద్యోగులు అర్థం చేసుకోవాలని అన్నారు.

**పకడ్బందీగా కుటుంబ సర్వే**

ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వే జిల్లాలో పకడ్బందీగా చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించి పూర్తి వివరాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 2.36లక్షల ఇండ్లు ఉన్నాయని, వీటి సర్వే కోసం 2,300మంది ఎన్యూమరేటర్లు, ఇతర స్పెషలాఫీసర్లను నియమించామని, ఈ నెలాఖరులోగా సమగ్ర సర్వే పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# సెట్విన్ కేంద్రాల్లో నిరుద్యోగులకు శిక్షణ

**సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఎండీ వేణుగోపాల్‌రావు**

జహీరాబాద్, నవంబర్ 7: సెట్విల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఎండీ వేణుగోపాల్‌రావు అన్నారు. జహీరాబాద్‌లోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న సెట్విన్ శిక్షణ కేంద్రం పనులను గురువారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 23 శిక్షణ కేంద్రాలు నెలకొల్పినట్లు తెలిపారు. కొత్తగా జహీరాబాద్, హుస్నాబాద్, నల్లగొండ, జడ్చర్ల, మహబూబ్‌నగర్‌లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల 17న హుస్నాబాద్‌లో సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఆ తర్వాత జహీరాబాద్‌లో ప్రారంభిస్తామన్నారు. శిక్షణ కేంద్రాలో 60 కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జహీరాబాద్‌లో సీసీ కెమెరా, ఏసీ రిపేరింగ్, మొబైల్ రిపేరింగ్, ప్రీ ప్రైమరీ టీచర్స్, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జహీరాబాద్ ప్రాంతంలోని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇస్తామన్నారు. సెట్విన్‌లో శిక్షణ పొందిన వారికి జాబ్‌మేళాను నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.



జహీరాబాద్‌లో సెట్విన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఎండీ వేణుగోపాల్‌రావు

**19న శిక్షకులకు ఇంటర్వ్యూలు**

జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న సెట్విన్ శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ యువతీయువకులను శిక్షణ ఇచ్చేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సెట్విన్ ఎండీ వేణుగోపాల్ రావు తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు డిగ్రీ, డిప్లొమా పాసైన అర్హులు జహీరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నైపుణ్యతను బట్టి రూ.10 వేల నుంచి 20 వేల వరకు వేతనం ఇవ్వనున్నామన్నారు. ఈనెల 19న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించి శిక్షకులను ఎంపిక చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, సెట్విన్ అధికారులు పాల్గొన్నారు.



అక్కన్నపేటలో స్థల పరిశీలనలో భాగంగా కలెక్టర్, ఎండీతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

# ఇండస్ట్రియల్ పార్కుతో ఉపాధి

**రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్**

అక్కన్నపేట, నవంబర్ 7: ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుతో పారిశ్రామికంగా అభివృద్ధి చెంది ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి క్రాసింగ్ వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం గురువారం టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి స్థలాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. త్వరితగతిన స్థలసేకరణ పూర్తి చేసి పరిశ్రమల శాఖకు అప్పగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ అనంత రెడ్డి, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఎంపీడీవో బానోతు జయరామ్, కాంగ్రెస్ నాయకులు బంక చందు, జంగపల్లి అయిలయ్య, ముత్యాల సంజీవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి



లచ్చపేటలో విలేకరులతో మాట్లాడుతున్న బాధితుడు బత్తిని సతీశ్‌గౌడ్ తదితరులు

దుబ్బాక, నవంబర్ 7: తమకు తెలియకుండానే భూమిని మరొకరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం లచ్చపేటలోని ఎల్లమ్మ ఆలయం వద్ద బాధితులు విలేకరుల సమావేశంలో తమ గోడు వెల్లబోసుకున్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో సర్వే నెంబర్ 26లో నారాగౌడ్ అనే వ్యక్తి పేరిట 9 ఎకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. ఆ భూమిలో నుంచి 15 గుంటల భూమిని 6 నెలల కిందట రాజన్న సిరిసిల్లకు చెందిన ఎర్రగుంట భరత్‌కుమార్, అతడి కుటుంబీకుల పేరిట తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితులు బత్తిని సతీశ్ గౌడ్ తదితరులు ఆరోపించారు. తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి అప్పటి దుబ్బాక సబ్ రిజిస్ట్రర్ అయేషా తబుస్సుం హయాంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఈ విషయంపై సబ్ రిజిస్ట్రర్‌ను తాము ప్రశ్నించగా.. తమ భూమికి సంబంధించిన ధ్రువపత్రాలను పునఃపరిశీలించినట్లు చెప్పారు.15 గుంటల భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగినట్లు సబ్ రిజిస్ట్రర్ సైతం ఒప్పుకున్నారని తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎర్రగుంట భరత్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు సహకరించిన సబ్‌రిజిస్ట్రర్‌పై, ఎర్రగుంట భరత్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో న్యాయం చేయాలని కలెక్టర్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.